క్లుప్తంగా

అధ్వానంగా డ్రైన్



డ్రైన్‌పై రెండే రెండు మిగిలిన శ్లాబ్ రాళ్లు

ఏలేశ్వరం: నిత్యం రాకపోకలు సాగించే రహదారికి చెంతనే డ్రైన్ అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక 11వ వార్డులోని ప్రధానరహదారి డ్రైన్‌పై వేసిన శ్లాబ్‌రాళ్లు శిథిలమవ్వగా రెండు మాత్రమే మిగిలాయి. దీంతో ద్విచక్ర వాహనాలు మాత్రమే ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. పెద్ద వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే డ్రైన్‌పై పూర్తిస్థాయిలో శ్లాబురాళ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



లింగంపర్తిలో ఓ పక్కకు ఒరిగిపోయిన విద్యుత్‌స్తంభం

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి మంచి నీటి ట్యాంక్ సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఇటీవల ఈదురు గాలులకు స్తంభం ఒక పక్కకు ఒరిగిపోయింది. ఏ క్షణంలోనైనా స్తంభం కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే రహదారి కావడంతో పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ



యర్రవరంలో వృద్ధులు, దివ్యాంగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరం వృద్ధులు, దివ్యాంగులకు ఆదివారం రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు, భారత ప్రభుత్వ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ చిలుకూరి రామ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకులు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొల్లా శ్రీనివాస్, వెలుగూరి హరేరామ్, కర్రి ధర్మరాజు, దాకే కృష్ణారావు, కూరాకుల రాజా, బండారు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెరుమాళ్లపురంలో మెగా రక్తదాన శిబిరం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో సోమవారం ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆదివారం నిర్వాహకులు తెలిపారు. హార్వార్డ్ అప్పారావు వర్ధంతి సందర్భంగా హార్వార్డ్ విద్యా సంస్థల పూర్వ విద్యార్థులు, స్ఫూర్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. కోన ప్రాంత ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మాణిక్యం కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మోషే తదితరులు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు కోళ్లఫారం కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నల్లల మాణిక్యం కుటుంబానికి మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే ఆర్థిక సాయాన్ని అందించారు. మోషే ఆదివారం మృతుడి ఇంటికి వెళ్లి మాణిక్యం భార్య పద్మ, ఇతర కటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితులకు 50 కిలోల బియ్యం, నగదును అందజేశారు. ఇద్దరు పిల్లలతో ఉన్న ఆ కుటుంబాన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్, రాజబాబు రెడ్డి, గంటా నాగభూషణం, టి.కుమార్, పలకా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లిన ఏపీ ఎన్‌జీఓలు

ప్రత్తిపాడు: విజయవాడలో సోమ, మంగళవారాల్లో జరిగే ఏపీ ఎన్‌జీఓ 21వ రాష్ట్ర మహాసభలకు ఆదివారం సాయంత్రం ప్రత్తిపాడు నుంచి ఎన్‌జీఓలు బయలుదేరి వెళ్లారు. ప్రత్తిపాడు యూనిట్ ఏపీ ఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు రామిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో 30 మంది కార్యవర్గ సభ్యులు కార్లలో విజయవాడ వెళ్లారు.

మోతాదుకు మించితే ముప్పు

- వరిసాగులో ఎరువుల యజమాన్యం కీలకం
- భూసార పరీక్షల ఆధారంగా వినియోగిస్తే మంచి ఫలితాలు
- మితిమీరిన ఎరువుల వాడకంతో పంటలకు నష్టం
- సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలంటున్న వ్యవసాయాధికారులు



కోటనందూరులో తయారు చేసిన వరి నారుమడి

కోటనందూరు: తొలకరి పలకరించడంతో మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజక వర్గాల్లో రైతులు కోటి ఆశలతో ఖరీఫ్ వరి సాగును ప్రారంభించారు. నీటి వనరులు ఉన్న చోట ఇప్పటికే నాటు వేశారు. కొన్ని గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. కాగా వరిసాగులో ఎరువుల యాజమాన్యం ఎంతో కీలకం. భూసార పరీక్షల ఆధారంగా నేల పరిస్థితిని బట్టి ఎరువులను అవసరం మేర వినియోగిస్తే ఆశించిన ఫలితాలు పొందవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మితిమీరిన ఎరువుల వినియోగంతో ఆరోగ్యంతో పాటు దిగుబడులు కూడా కోల్పోయే ప్రమాదముంది. రైతులు ఎరువుల యాజమాన్యంపై అవగాహన పెంచుకొని సాగులో పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

40 వేల ఎకరాల్లో సాగు

ఈ ఏడాది తుని సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 40 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇటీవల అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుని సాగుకు సిద్ధంగా ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే నారు మడులను సిద్ధం చేస్తుంటుండగా మరో 10 రోజుల్లో పనులు ఊపందుకునే అవకాశం కనిపిస్తోంది. వరిసాగులో యూరియా, డీఏపీతో పాటు పొటాష్‌ను తగిన మోతాదులో వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ప్రధాన ఎరువుల వినియోగం

ఎకరం పొలానికి 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమడి తయారు చేసుకోవాలి. విత్తనాలు చల్లిన తరువాత నాలుగు కేజీల డీఏపీ, రెండు కేజీల యూరియా, కేజీ పొటాష్ కలిపి వేస్తే ఆకు ఏపుగా ఎదుగుతుంది. మొదటి దమ్ములో మూడు బస్తాల సూపర్, బస్తా డీఏపీ, నాట్లుకు ముందు 35 కేజీల యూరియా, 12 కేజీల పొటాష్ కలిపి వాడాలి. నాట్లు వేసిన 45 రోజుల తరువాత 45 కేజీల యూరియా, 12 కేజీల పొటాష్ వేసుకోవాలి. పొట్ట దశలో మరో 35 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ కలిపి వాడాలి. 60 రోజుల వ్యవధిలో 35 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ చొప్పున వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

పొటాష్ లోపంతో ప్రమాదం

సాధారణంగా రైతులు వరిసాగులో యూరియా, డీఏపీలకు అధిక ప్రాధాన్యమిస్తూ పొటాష్ వినియోగంపై ఆసక్తి చూపడం లేదు. పొటాష్ లోపం కారణంగా గింజ గుల్లబారి బరువు తగ్గిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగులో పొటాష్ వినియోగంపై దృష్టి సారించాలని చెబుతున్నారు. పొటాష్ వినియోగాన్ని పట్టించుకోకపోతే రైతుల భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది.

గెత్తం, పచ్చిరొట్టతో సారవంతం

పంట సాగు చేసే పొలంలో దమ్ము చేయడానికి 15 రోజుల ముందు పశువుల పెంట(గెత్తం), జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట ఎరువులు వాడితే భూమి సారవంతమై అధిక దిగుబడులు వస్తాయి. వీటి వినియోగంతో భవిష్యత్‌లో కూడా భూసారం తగ్గిపోకుండా ఉంటుంది.

సేంద్రియ ఎరువులపై దృష్టి

తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు ఇచ్చే సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మితిమీరిన రసాయనిక ఎరువుల వాడకంతో అనారోగ్య దిగుబడులతో పాటు నేల నిస్సారమైపోతుందని హెచ్చరిస్తున్నారు. కొంత కష్టమైనా తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేంద్రియ ఎరువులను తయారు చేసుకొని వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన అవసరం



వరి సాగులో ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సమావేశాలు ఏర్పాటు చేసి ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. సమగ్ర ఎరువుల యాజమాన్యంతో ఖరీఫ్ సాగులో మంచి దిగుబడులు వస్తాయి. రైతు భరోసా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. సేంద్రియ ఎరువుల వైపు రైతులు అడుగులేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

– కేజే చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు

పరదేశమ్మ జాతరకు చురుగ్గా ఏర్పాట్లు



పరదేశమ్మ అమ్మవారు

తుని రూరల్: మండలంలోని కొత్త సూరవరంలో కొలువైన పరదేశమ్మతల్లి 38వ జాతర మహోత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 23న అమ్మవారి జాతర, 24న తీర్థం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ వేముల శివన్నారాయణ తెలిపారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఆలయం నుంచి గ్రామ ముఖద్వారం వరకూ విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాతరోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి విశాఖపట్నం వారితో డీజే డ్యాన్స్ బేబీ డ్యాన్స్, విజయవాడ వారితో మ్యూజికల్ నైట్–డ్యాన్స్ హంగామా, వెంకటరమణ మూర్తి పాట, గరగలాట ఏర్పాటు చేశారు. గురువారం తీర్థం, విశేష పూల అలంకరణలో అమ్మవారి దర్శనాలు, గాజువాక వారితో డీజే డ్యాన్స్ బేబీ డ్యాన్స్, కూచిపూడి నృత్య ప్రదర్శన, బొమ్మల ప్రదర్శన, సన్నాయి మేళం తదితర ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



ప్రత్తిపాడులో రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రత్తిపాడు: భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఆదివారం ప్రత్తిపాడులో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ కళా మందిర్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. దేశానికి రాజీవ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి సత్తిబాబు, ఈరుగుల చక్రం, కందిమళ్ల సామ్యేలు, కాళ్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కోటనందూరులో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోటనందూరు: స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు గర్సింగు దొరబాబు ప్రారంభించారు. కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు 65 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 25 మందిని శస్త్ర చికిత్సలకు సూచించారు. మరో 25 మందికి కళ్లద్దాలు అవసరమని, ముగ్గురికి రెటీనా సమస్య ఉన్నట్లు గుర్తించారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని కిరణ్ కంటి ఆసుపత్రి బస్సులో కాకినాడ తరలించి పూర్తి ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కురందాసు రాంబాబు, దార్ల సూర్యచంద్ర, ఉల్లూరి శ్రీను, మళ్ల సూర్యచంద్ర, డాక్టర్ హేమ, కిరణ్ ఆసుపత్రి ప్రతినిధులు కంఠం బాలాజీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన



హంసవరంలో గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మేరీఅవినాష్

తుని రూరల్: వంట గ్యాస్ వినియోగించే మహిళలు వంటింట్లో సురక్షితంగా ఉండాలని హంసవరం సర్పంచ్ రాయి మేరీఅవినాష్ సూచించారు. మండలంలోని హంసవరంలో తుని సమత గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత సర్వీసింగ్ శిబిరం, గ్యాస్ ప్రమాదాలపై అవగాహన సదస్సును ఆమె ప్రారంభించారు. లబ్ధిదారులకు కొత్త గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేరీఅవినాష్ మాట్లాడుతూ సమత గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు చేసిన ఉచిత సర్వీసింగ్‌ను వంట గ్యాస్ వాడకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు వంటగ్యాస్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదాలు సంభవిస్తే ఏవిధంగా స్పందించాలో సమత గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 1906కు ఫోన్ చేయాలన్నారు. రాయి దాసు, రాయి రమేష్, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ హవా

పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు సత్తా చాటారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పలు పంచాయతీ వార్డులకు శనివారం జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



గంధం కమల — పి.నాయకంపల్లి, 1వ వార్డు, ఏకగ్రీవం, గండేపల్లి మండలం



దోమాడ తలుపులమ్మ — టి.తిమ్మాపురం, 2వ వార్డు, ఏకగ్రీవం, తుని మండలం



కందెల్లి గంగాభవానీ — కందెల్లి గంగాభవానీ, రాజుపాలెం, 6వ వార్డు, ఏకగ్రీవం, కిర్లంపూడి మండలం



అడబాల వెంకటలక్ష్మి — అడబాల వెంకటలక్ష్మి, పాలెం, 10వ వార్డు, ఏకగ్రీవం, కిర్లంపూడి మండలం



పాము చంటమ్మ — పాము చంటమ్మ, కత్తిపూడి, 5వ వార్డు, ఏకగ్రీవం, కిర్లంపూడి మండలం



కురందాసు సూరిబాబు — కురందాసు సూరిబాబు, అచ్చంపేట, 6వ వార్డు, ఏకగ్రీవం, కిర్లంపూడి మండలం

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



కొత్తచోడిపల్లిపేటలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేసిన వైస్ ఎంపీపీ నాగం గంగబాబు తదితరులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ కొత్తచోడిపల్లిపేటలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం వైస్ ఎంపీపీ నాగం గంగబాబు భూమి పూజ చేశారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాలతో కొత్తచోడిపల్లిపేటలో సీసీ రోడ్ల నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.15 లక్షలు కేటాయించారు. ఈ మేరకు వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైస్ ఎంపీపీ యాదాల రమణ తదితరులతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దడాల విజయబాబు, మాజీ సర్పంచ్ గంగిరి అడివియ్య, ఎంపీటీసీ అంబుజాలపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవే పరమావధిగా..



తుని రోటరీ క్లబ్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రోటరీ గవర్నర్ సుబ్బారావు

తుని: ప్రజా సేవే పరమావధిగా రోటరీ క్లబ్ పని చేస్తోందని రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ రావూరి సుబ్బారావు(దత్త) అన్నారు. అధికారిక పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన స్థానిక రోటరీ సెంట్రల్ క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుని పరిసర ప్రాంత ప్రజలకు తుని రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను అభినందించారు. సమాజ హితమే లక్ష్యంగా మరిన్ని సేవలు చేయాలని క్లబ్ ప్రతినిధులకు సూచించారు. తుని రోటరీ క్లబ్ అధ్యక్షుడు భోజంకి నరశింహమూర్తి మాట్లాడుతూ తుని పట్టణం, రూరల్ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, మొక్కలు నాటడం, మెడికల్ క్యాంపులు వంటి అనేక కార్యక్రమాలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బొప్పన రాము, అసిస్టెంట్ గవర్నర్ పి.నారాయణ, క్లబ్ ప్రతినిధులు ఎం.భాస్కర్, బోడిశెట్టి రాజా, రాజేష్, దండెం రామకృష్ణ, కంకిపాటి జమీలు తదితరులు పాల్గొన్నారు.

హిందూధర్మ పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ ప్రాంత ప్రముఖ్ కొండారెడ్డి

ప్రత్తిపాడు రూరల్: హిందూ ధర్మ రక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సమరసత సేవా ఫౌండేషన్ ప్రాంత ప్రముఖ్ కొండారెడ్డి కోరారు. మండలంలోని గజ్జినపూడి రాజరాజేశ్వరీదేవి పీఠాశ్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట సబ్ డివిజన్లకు సంబంధించి 10 మండలాల గ్రామ కన్వీనర్లకు ఆదివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా రెడ్డి మాట్లాడుతూ హిందూధర్మ పరిరక్షణ కోసం కన్వీనర్లు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గోదావరి జోన్‌ధర్మ ప్రచారక్ జగన్నాథం, జిల్లా సహ కన్వీనర్ కంబాల నారాయణ రావు, జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు, జిల్లా సభ్యులు కొప్పన కోటేశ్వరరావు, వరహాలు బాబు, ప్రత్తిపాడు మండల కన్వీనర్ తోలేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఒమ్మంగిలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు ఆదివారం తెలిపారు. సాయంత్రం మూడు గంటలకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ప్రత్తిపాడు రూరల్: విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఈ నెల 22న ప్రత్తిపాడు సబ్ డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జగ్గంపేట ఈఈ రత్నాలరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలతో పాటు నిర్వహణపై తగు సూచనలు అందించాలని ఆయన కోరారు.

పళ్లంరాజు నియామకంపై హర్షం

జగ్గంపేట: కాంగ్రెస్ వర్కింగ్ కౌన్సిల్ (సీడబ్ల్యూసీ) ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంఎం పళ్లంరాజు నియామకంపై జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మరోతి శివగణేష్ ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్లంరాజుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పళ్లంరాజుకు అభినందనలు తెలపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జగ్గంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట నరసింహం అన్నారు. మండలంలోని కొత్తూరులో తోట నరసింహం అనుచరుడు నకిరెడ్డి విష్ణు ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇంటికే సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఎస్ఏ గఫూర్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, నాయకులు అత్తులూరి సాయిబాబు, గుల్ల ఏడుకొండలు తోట అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా పశువుల తరలింపు



జెడ్‌రాగంపేట వద్ద ఆవులను మినీ గూడ్స్ వాహనంలో తరలిస్తున్న దృశ్యం



వాహనంలోని ఆవు బయటకు వచ్చేస్తుండటంతో లోపలకి నెడుతున్న క్లీనర్

గండేపల్లి: పశువధను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా అవి సక్రమంగా అమలు కావడం లేదు. పశువులను యథేచ్ఛగా కబేళాలకు తరలిస్తున్నారు. వందల కిలోమీటర్లు తరలిస్తున్న పశువులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదు. కిక్కిరిసిపోయేలా వాహనాల్లో పశువులను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం పలు వాహనాల్లో జాతీయ రహదారిపై నిత్యం శ్రీకాకుళం, విజయనగరం తదితర జిల్లాల నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ వైపు పశువుల తరలింపు వాహనాలు వెళుతున్నాయన్నారు. మిని గూడ్స్ వాహనాలు, కంటైనర్లు వంటి వాహనాల్లో పదుల సంఖ్యలో పశువులను తరలిస్తున్నారు. గాలి కూడా ఆడకపోవడంతో మార్గం మధ్యలోనే కొన్ని పశువులు మృత్యువాత పడుతున్నాయి. వాహనాల్లో పశువులను కుక్కడంతో వాటికి కనీసం అటూఇటూ కదిలే అవకాశం ఉండడం లేదు. కొన్ని ప్రాంతాల్లో వాహనాల్లో నుంచి రోడ్డుపై పశువులు పడిపోయిన సంఘటనలూ ఉన్నాయి. తరలించే వాహనాలకు రికార్డులు, నంబర్ ప్లేట్లు, బ్రేక్ లైట్స్, సిగ్నల్ లైట్స్ లేకపోవడంతో వెనక వస్తున్న వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా వంతెన



రాజవరం–గంగవరం రహదారిలో శిథిలమైన వంతెన

రౌతులపూడి: మండలంలోని రాజవరం–గంగవరం రహదారిలో ఏలేరు ఎడమ కాలువపై నిర్మించిన వంతెన శిథిలస్థితికి చేరింది. పదేళ్ల క్రితమే వంతెనకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఆ మార్గం వెళ్లే వాహనాలు, ఆటోలు ఏ మాత్రం అదుపు తప్పినా కాలువలోకి జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెనకు కొత్తగా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని గతంలో అనేక సార్లు అధికారులను పట్టించుకోదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.